సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 90 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/ 15.9°
జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం కొన్ని ప్రాంతాల్లో చలి ప్రభావం కనిపించింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్లెయిమ్‌లన్నీ పరిష్కరించాలి
- కలెక్టర్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌కుమార్

పుట్టపర్తి టౌన్: ఓటరు జాబితా సవరణలో అందిన క్లెయిమ్‌లన్నీ పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్ అరుణ్‌బాబును ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్ఓ కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల అధికారితో మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. అలాగే ఓటరు జాబితా సవరణ, ఎన్నికల నిర్వహణ సంసిద్ధతతపై తరచూ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అభ్యంతరాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బందిని నియమించామని, వారికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఫాం- 6, 7, 8, దరఖాస్తులన్నీ సకాలంలో పరిష్కరిస్తామన్నారు. ఓట్ల తొలగింపు (ఫారం-7) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

జర్మన్ భాషపై ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'గాక్-గో జర్మనీ' సంయుక్తంగా యువతకు జర్మన్ భాష నేర్పించడంతో పాటు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తి చేసిన వారు, చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు జర్మనీలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వయస్సు 20- 45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఇంటర్వ్యూ, శిక్షణ తిరుపతిలో ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 12వ తేదీలోపు www. apssdc. in వెబ్‌సైట్‌లో వివరాల నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9505353545,9988853335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాల సేకరణ కేంద్రాలకు లైసెన్స్‌లు తప్పనిసరి



పుట్టపర్తి టౌన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పాలసేకరణ, శీతలీకరణ కేంద్రాలకు (పాలడెయిరీలు) ఆంధ్రప్రదేశ్ మిల్క్ యాక్ట్ -2023 ప్రకారం లైసెన్స్‌లు తప్పని సరిగా తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శుభదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలసేకరణ, పాల శీతలీకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నప్పటికీ ఇంకా లైసెన్స్ పొందని వారు మార్చి 10వ తేదీలోపు సమీపంలోని పశువైద్యశాల లేదా రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. లైసెన్స్ లేని కేంద్రాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



కేజీబీవీ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రాష్ట్ర స్థాయి బృందం సభ్యులు

ముదిగుబ్బ: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగాలని, ఇందుకు ఉపాధ్యాయులు కూడా ముందస్తుగా సన్నదం కావాలని లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపీ) స్టేట్ మానిటరింగ్ బృందం సభ్యులు సూచించారు. శుక్రవారం బృందం సభ్యులు వెంకటరమణ, డేవిడ్ శ్రీనివాసులు, విజయ్‌కుమార్ తదితరులు ఎంఈఓ కిరణ్మయితో కలిసి ముదిగుబ్బ కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్ఐపీ బృందం సభ్యులు ఉపాధ్యాయుల బోధన గురించి ఆరా తీశారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠాల ఫీడ్‌బ్యాక్‌ను తీసుకున్నారు. అన్ని అంశాలను పరిశీలించిన రాష్ట్ర బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాఘవ, మొహిద్దీన్ సాలేహా, ఎస్ఓ ఫక్రుబీ తదితరులు పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగులు

హిందూపురానికి చెందిన దివ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. రెండేళ్లుగా బోర్డు సరిగా కనిపించక ఇబ్బందులు పడేది. నోట్స్ సరిగా రాసుకోలేకపోయేది. రెండు నెలల క్రితం పాఠశాలలోనే 'కంటి వెలుగు' శిబిరం నిర్వహించగా, వైద్యులు పరీక్షించి ఆమెకు కంటి చూపు మందగించినట్లు గుర్తించారు. వారం తర్వాత కళ్లద్దాలు అందజేశారు. ఇప్పుడు దివ్య కంటి సమస్య పరిష్కారం కాగా, హాయిగా చదువుకుంటోంది.

మడకశిరకు చెందిన రాధమ్మ ఒంటరి మహిళ. దాదాపు 65 ఏళ్లపైనే వయస్సు ఉంటుంది. భర్త పదేళ్ల క్రితమే మృతిచెందాడు. సంతానం కూడా లేకపోవడంతో తెలిసిన వారి సాయంతో ప్రభుత్వం ఇచ్చే పింఛనే ఆధారంగా రామమ్మ జీవనం సాగిస్తోంది. ఇటీవల చూపు మందగించి తీవ్ర ఇబ్బందులు పడేది. ఆస్పత్రికి తీసుకెళ్లేవారు కూడా లేక ఆమె జీవితం అంధకారంగా మారింది. కానీ నెలరోజుల క్రితం మడకశిరలో నిర్వహించిన 'కంటి వెలుగు' శిబిరంలో ఆమెను పరీక్షించిన వైద్యులు ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వడంతో పాటు మందులూ అందించారు. ఇప్పుడు తన పనులు తాను చేసుకుంటున్నానని, చూపు బాగా కనబడుతోందని రామమ్మ ఆనందంగా చెబుతోంది.

...ఇలా చిన్నారులు, వృద్ధులు...ఎందరో జీవితాల్లో 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం వెలుగులు నింపింది. గ్రామాల్లో నిర్వహించే సురక్ష శిబిరాల్లోనే అధికారులు 'కంటి వెలుగు' శిబిరాలు కూడా నిర్వహిస్తూ స్థానికంగానే పరీక్షలు చేయిస్తున్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు.



కంటి వెలుగు కార్యక్రమంలో ఓ చిన్నారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నిరుపేదకు 'కంటి వెలుగు'
- గ్రామగ్రామానా 'వైఎస్సార్ కంటి వెలుగు' శిబిరాలు
- ఉచితంగా పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందుల పంపిణీ
- జిల్లాలో 2,253 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ అపరేషన్లు
- 16,838 మందికి కంటి అద్దాల పంపిణీ
- రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్షలో 8,927 మందికి పరీక్షలు
- 5,147 మందికి కళ్లద్దాలు అందజేసేందుకు చర్యలు

ప్రశాంతి నిలయం: పేదల ఆరోగ్యంపై జగన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రధానంగా కంటి చూపు సరిగా లేక ఇబ్బంది పడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలందిస్తోంది. కంటిచూపు సమస్యతో ఇబ్బందులు పడుతున్న ఎందరో విద్యార్థులు, వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. గ్రామ గ్రామానా 'వైఎస్సార్ కంటి వెలుగు' శిబిరాలు నిర్వహించి స్థానికంగానే సేవలందిస్తోంది. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లోనే కంటి పరీక్షలు సైతం నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తోంది. మెరుగైన శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేసి ఉచితంగా చికిత్సలు అందిస్తోంది.

తొలిదశలోనే 2,253 మందికి శస్త్ర చికిత్సలు

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆరు దశల్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మూడు దశల్లో కంటి వెలుగు వైద్య శిబిరాల నిర్వహణ పూర్తి చేసింది. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతోపాటు నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో కంటి చూపు లోపం ఉన్న 3,043 మందిని వైద్యులు క్యాటరాక్ట్ ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. ఇందులో 2,253 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు. మిగిలిన వారికి త్వరలోనే శస్త్ర చికిత్సలు చేయించేందుకు చర్యలు చేపట్టారు. మరో 369 మందిని ఇతర శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. అలాగే 16,838 మందిలో దృష్టి లోపాన్ని గుర్తించిన వైద్యులు వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు.

రెండో దశలో 8,927 మందికి పరీక్షలు

రెండోదశ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకు వైద్యులు 8,927 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 3,670 మందికి మందులు అవసరమని గుర్తించి ఉచితంగా అందజేశారు. అలాగే కంటి చూపు సమస్య ఉన్న 5,147 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 101 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించి ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దృష్టి లోపం ఉన్న పిల్లలను గుర్తించి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారు.

ఆపరేషన్‌తో చూపొచ్చింది



నాకు రెండేళ్లుగా చూపు మందగించింది. ప్రభుత్వం ఇటీవల మా ఏరియాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లి కంటి డాక్టర్‌కు చూపించాను. ఆపరేషన్ చేయాల్సి వస్తుందని చెప్పారు. రెండురోజుల్లోనే ఏఎన్ఎం వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్లింది. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నా కళ్లు బాగా కనిపిస్తున్నాయి.
– రామలక్ష్మి, విద్యానగర్, హిందూపురం

నిరుపేదలకు ఎంతో మేలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోంది. ముఖ్యంగా స్థానికంగా కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల వృద్ధులకు ఉపయుక్తంగా ఉంది. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన వారందరికీ ఇప్పటికే క్యాటరాక్ట్ సర్జరీలు చేయించడంతో పాటు కళ్లద్దాల పంపిణీ పూర్తి చేశాం. ఇప్పుడు రెండో విడత ఆరోగ్య సురక్షలో కంటి చూపు సమస్య ఉన్న వారిని గుర్తించాం. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి త్వరలోనే చేయిస్తాం. అలాగే కళ్లద్దాలు అవసరమైన వారి కోసం ఇప్పటికే ఇండెంట్ ఇచ్చాం.
–డాక్టర్ అనూరాధ, జిల్లా అంధత్వ నివారణ అధికారిణి

రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్
- పురం ప్రభుత్వాస్పత్రికి మహర్దశ
- 25న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- ఏర్పాట్లు పరిశీలించిన డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్



క్రిటికల్ కేర్ బ్లాక్ శంకుస్థాపనకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి మహర్దశ పడుతోంది. జిల్లాకే పెద్దదిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే వసతులు మెరుగుపర్చడంతో పాటు సిబ్బందినీ తగినంత నియమించింది. ఇక అత్యవసర సమయంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ నెల 25న క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ తదితరులు క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 'ఆయుష్మాన్ భారత్ మిషన్'లో భాగంగా హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మించనున్నట్లు తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి వస్తే వెంటిలేటర్‌పై వైద్యం అందించవచ్చన్నారు. దీనివల్ల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారికి, రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. అనంతరం వారు శంకుస్థాపన పనుల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌తో చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ రుక్మిణమ్మ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

శ్వేత గజవాహనంపై శ్రీవారు




బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొండమీద రాయుని బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి శ్రీవారిని శ్వేత గజ వాహనంపై ఊరేగించారు. శ్రీవారు, భూదేవి, శ్రీదేవి విగ్రహాలను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. పుర వీధుల గుండా సాగిన ఊరేగింపులో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


నేడు రథోత్సవం

బుక్కరాయసముద్రం కొండమీద రాయుని బ్రహ్మోత్సవాల్లో శనివారం బ్రహ్మ రథోత్సవం జరగనుంది. తెల్లవారుజామున 4 గంటలకు లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో శ్రీవారు, భూదేవి, శ్రీదేవికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు పుర వీధులలో శ్రీవారు, భూదేవి, శ్రీదేవిని సూర్య ప్రభ వాహనంపై పుర వీధులలో ఊరేగించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కొండమీద రాయుని రథోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

'గ్రూప్-2' పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ కొండయ్య



సమావేశానికి హాజరైన అధికారులు

- కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- అధికారులకు డీఆర్ఓ కొండయ్య ఆదేశం
- అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచన

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 25న గ్రూప్-2 పరీక్ష అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కొండయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహణపై సెక్షన్, రూట్, లైజనింగ్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 25వ తేదీ (ఆదివారం) నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షకు జిల్లా నుంచి 8,239 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. వీరికోసం 28 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 395 మంది ఇన్విజిలేటర్లు, 11 మంది జిల్లా రూట్ ఆఫీసర్లు, 28 మంది లైజన్ ఆఫీసర్లు, మరో 28 మంది సూపరింటెండెంట్లను నియమించామన్నారు. రెవెన్యూ, వైద్య, ఆర్టీసీ, పోలీసు, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండి లోటుపాట్లు రాకుండా చూడాలన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని డీఆర్ఓ ఆదేశించారు. సమీప ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని డీఆర్ఓ కొండయ్య సూచించారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డు (ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్ కార్డు, తదితర) వెంట తెచ్చుకోవాలని సూచించారు. అనుమానాల నివృత్తి కోసం అభ్యర్థులు 9014550879, 9948619163 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో అధికారులు అశోక్, వెంకటరమణ, ఏఓ రామాంజులరెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుకు కరువు లేదు

- రబీ పంటలకు పుష్కలంగా ఎరువులు
- ఇప్పటికే 2,882 మెట్రిక్ టన్నుల పంపిణీ
- ఆర్‌బీకేలు, సహకార సంఘాల్లో నిల్వ



పుట్టపర్తి అర్బన్: పంటల సాగులో రైతుకు కష్టం కలగకుండా చూస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు కావాల్సిన సకలం అందజేస్తోంది. ఈ క్రమంలో రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టింది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు.. సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు అందజేస్తోంది.

ముందస్తు ప్రణాళిక మేరకు నిల్వ

రబీ ప్రణాళిక ముందుగానే సిద్ధం చేసిన జిల్లా వ్యవసాయశాఖ రైతులకు కావాల్సిన ఎరువులను సకాలంలో తెప్పించింది. జిల్లా రైతులు రబీలో సుమారు 35 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో వేరుశనగ, వరి, మొక్కజొన్న, రాగి, కలింగర, దోస, తదితర పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉన్నాయి. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలకు వివిధ రకాల ఎరువులు సరఫరా చేసి నిల్వ చేసింది.

యూరియానే ఎక్కువ

డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, యూరియాను అధికారులు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేశారు. ఇందులో డీఏపీ బస్తా రూ.1,350, ఎంఓపీ రూ.1,081 , యూరియా రూ.266.53 , కాంప్లెక్స్ ఎరువులు రూ.1,200 ప్రకారం రైతులకు పంపిణీ చేశారు. ఇక రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్కీల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువుల వివరాలను నమోదు చేయగానే వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు సరఫరా చేస్తున్నారు. రబీలో డీఏపీ 590 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 121 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 463 మెట్రిక్ టన్నులు, యూరియా అత్యధికంగా 1,708 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ఇలా మొత్తంగా ఇప్పటికే 2,882 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు పంపిణీ చేశారు. ప్రస్తుతం జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో 260 టన్నుల వరకూ ఎరువులు నిల్వ ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. రైతు ఇండెంట్ ఇవ్వగానే ఎరువులు తెప్పించి ఇస్తున్నామని తెలిపారు.

అడిగినంత పంపిణీ చేస్తున్నాం

రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేదు. ముందస్తు అంచనా మేరకు రైతులకు కావాల్సిన ఎరువులను ఇప్పటికే ఆర్బీకే, సొసైటీలకు సరఫరా చేశాం. చాలా ప్రాంతాల్లో పంపిణీ కూడా పూర్తి చేశాం. ఇంకా ఎవరికైనా అవసరమున్నా ఇస్తాం. ఇప్పటికీ జిల్లాలో 260 టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. యూరియా అధికంగా ఇస్తుండటంతో రైతులు ఆనందంగా కొనుగోలు చేస్తున్నారు.
– గీతమ్మ, ఏడీ, మార్క్‌ఫెడ్

కల్యాణం.. కమనీయం



విశేష అలంకరణలో పేట వెంకటరమణస్వామి మూలవిరాట్

- వైభవంగా పేట వెంకట రమణస్వామి కల్యాణోత్సవం
- నేడు బ్రహ్మరథోత్సవం



వెంకటరమణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఊరేగిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి బంగారు కవచాలు అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య భారీగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భగీరథ నవీన్, ఆలయ ఈఓ నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం పేట వెంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే స్వామివారి రథాన్ని వివిధ తోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు.

గంటల వ్యవధిలోనే చైన్ స్నాచింగ్ కేసు ఛేదింపు

అనంతపురం: నగరంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని కేవలం 6 గంటల్లోపే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. అనంతపురంలోని రెండో రోడ్డుకు చెందిన యశ్వంత్, జొన్న శ్రావణి ఇద్దరూ అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చుకునేందుకు వారు నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసులను అపహరించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటి ఎదుట నిద్రిస్తున్న వృద్ధురాలిని గమనించిన శ్రావణి వెంటనే యశ్వంత్‌ను అప్రమత్తం చేసింది. దీంతో యశ్వంత్ నల్లని బుర్ఖా ధరించి అపార్ట్‌మెంట్‌లో ఉన్న లిఫ్ట్ నుంచి కిందకు వచ్చి వృద్ధురాలి ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకుండా తలుపునకు గడియ పెట్టాడు. నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని రెండు బంగారు గొలుసులు లాక్కొని అపార్ట్‌మెంట్ మెట్ల ద్వారా పైకి వెళ్లిపోయాడు. ఘటనపై సీఐలు ధరణికిషోర్, ప్రతాపరెడ్డి, సీసీఎస్ సీఐ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. నగరంలోని ఎంఎంహెచ్ అపార్ట్‌మెంట్ వద్ద శుక్రవారం నిందితులను అరెస్ట్ చేసి, రూ.3.60లక్షల విలువ చేసే 6 తులాల రెండు బంగారు చైన్లను స్వాధీనం చేసుకున్నారు.

జీవాల పెంపకం లాభదాయకం


పుట్టపర్తి వద్ద నెలకొల్పిన పొట్టేళ్ల యూనిట్


పొట్టేళ్ల కోసం కప్పలబండ వద్ద సాగు చేసిన అవిశ పంట

- జిల్లాలో 50కి పైగా యూనిట్లు
- గ్రాసం కోసం వందలాది ఎకరాల్లో గడ్డి పెంపకం

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయంలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. సాధారణ పంటల సాగుతో విసిగి పోయిన రైతులు ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలోనే జీవాలు, కోళ్లు, పందులు, లేగ దూడల పెంపకం చేపట్టి లాభాలు గడిస్తున్నారు. గ్రామాల్లో చదువుకున్న కొందరు యువ రైతులు మామూలు ఉద్యాన పంటల కంటే శ్రీగంధం, రెడ్‌వుడ్, మహాఘని వృక్షాల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. మరి కొందరు రైతులు జీవాల యూనిట్లు నెలకొల్పి లబ్ధి పొందుతున్నారు. జీవాల పెంపకంలో ప్రధానంగా వాటి పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దాణా కోసం పలు రకాల గడ్డి పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగ పొట్టు, ఉలవ పొట్టు, జొన్న, మొక్క జొన్న పంటలతో పాటు సుబాబుల్, సూపర్ నేపియర్, అవిశ, స్టైలో హెమటా వంటి గడ్డి జాతి పంటలు చేస్తూ తక్కువ ఖర్చుతో అధిగ దిగుబడి సాధిస్తున్నారు.

సబ్సిడీతో జీవాల యూనిట్లు

జీవాల పెంపకం ప్రస్తుతం చాలా ఖరీదుతో కూడుకుంటోంది. 200 పొట్టేళ్ల యూనిట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణానికే రూ.20 లక్షలు ఖర్చు అవుతుంది. వాటిని సంరక్షించేందుకు కనీసం రెండు కుటుంబాలు కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జీవాల పెంపకానికి జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకూ సబ్సిడీ యూనిట్లు మంజూరు చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 124 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. కాగా, జిల్లాలో ఇప్పటికే 50 గొర్రెల యూనిట్లు ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు అంటున్నారు. వీటి కోసం దాదాపు 200 ఎకరాలకు పైగా గడ్డి క్షేత్రాలు వెలిసాయి.

పెన్నహోబిలాన్ని సందర్శించిన తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ


స్వామివారిని దర్శించుకున్న సోమేష్‌కుమార్, కుటుంబసభ్యులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా తెలంగాణ మాజీ చీఫ్ సెక్రెటరీ, జిల్లా పూర్వ కలెక్టర్ సోమేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో అర్చకులు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఉగ్రనరసింహుడి విగ్రహం ఏర్పాటులో ఆయన తీసుకున్న చొరవను, ఆలయ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

వైభవంగా సత్యసాయి గిరిప్రదక్షిణ


సత్యసాయి గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సత్యసాయి గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. ప్రశాంతి నిలయం విఘ్నేశ్వరుని ప్రవేశ దారం వద్ద ప్రత్యేక రథంపై బాబా చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. దేశ, విదేశీ భక్తులు భజనలు చేస్తూ ముందుకు లాగారు. ఏడు కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసి ప్రశాంతి నిలయం ముంగిటకు రథం చేరుకుంది.

108లో ప్రసవం


నవజాత శిశువును చూపుతున్న ఈఎంటీ హేమలత, ఆశ కార్యకర్త

ఓడీచెరువు: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... ఓడీ చెరువు మండలం డబురువారిపల్లికి చెందిన డి.రవి భార్య గంగాదేవికి శుక్రవారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకుని గర్భిణిని తీసుకుని ఓడీ చెరువు పీహెచ్‌సీలో చేర్పించేందుకు బయలుదేరింది. మార్గమధ్యంలో మామిళ్లకుంట్లపల్లి వద్ద నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ సనావుల్లా సాయంతో ఈఎంటీ హేమలత ఆమెకు కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు గంగాదేవి జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు


సమన్వయకర్తలు శాంతమ్మ, మక్బూల్‌అహ్మద్ సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

ఎన్పీకుంట: ధనియానిచెరువు పంచాయతీ గోవిందు రాజులపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి చొరవతో వైఎస్సార్‌సీపీలో చేరారు. కదిరిలోని పార్టీ సమన్వయకర్త కార్యాలయంలో శుక్రవారం సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహమ్మద్, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఈశ్వర్‌రెడ్డితో పాటు సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి నాయకులు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుని కదిరిలో ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మాజీ సమన్వయకర్త ఎస్.ఎం.డి.ఇస్మాయిల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో బోల్తా - 17 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న బెంగాల్‌కు చెందిన కూలీలు

యాడికి: బొలెరో బోల్తాపడిన ఘటనలో 17 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... పశ్చిమ బెంగాల్‌కు చెందిన 18 మంది బతుకు తెరువు కోసం తాడిపత్రికి వలస వచ్చి యాడికి మండలంలో అరటికాయల లోడింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం అరటి లోడింగ్‌కు ఉపయోగించే అట్ట ముక్కలను బొలెరో వాహనంలో వేసుకుని రాయలచెరువుకు ప్రయాణమయ్యారు. గ్రామ శివారులోని కేజీబీవీ వద్దకు చేరుకోగానే వాహనం టైర్ పేలి బోల్తాపడింది. ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో 11 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆరుగురిని అనంతపురానికి తీసుకెళ్లారు.

నేడు కోటంకలో రథోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గడ్డివాముల దగ్ధం

రాయదుర్గంటౌన్: డి.హీరేహాళ్ మండలం చెర్లోపల్లిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో 10 గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రైతులు అంజినయ్య, బుట్టప్ప, ఎర్రిస్వామి, సిద్ధప్ప, సుంకన్న గ్రామ శివారులో గడ్డివాములు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం మంటలు ఎగిసి పడుతుండడం గమనించిన స్థానికులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ లోపు 10 గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు.

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

- రూపకర్తలను అభినందించిన న్యాక్ పీర్ కమిటీ సభ్యులు


ఎలాంటి కోడింగ్ లేకుండానే పాఠాలు చెప్పే పరికరాన్ని పరిశీలిస్తున్న న్యాక్ కమిటీ సభ్యులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో విద్యార్థుల నూతన ఆవిష్కరణలు అబ్బురపరిచాయి. న్యాక్ పీర్ కమిటీ పర్యటన నేపథ్యంలో తమ ఆవిష్కరణలను శుక్రవారం విద్యార్థులు ప్రదర్శించారు. ప్రతి ఆవిష్కరణనూ న్యాక్ పీర్ కమిటీ సభ్యులు ఆసక్తిగా పరిశీలించారు. ప్రధానంగా ఎలాంటి కోడింగ్ లేకున్నా ఉపాధ్యాయుడి తరహాలో పిల్లలకు పాఠాలు చెప్పే ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్‌ను పరిశీలించి రూపకర్తలైన విద్యార్థులు బి. గీతాంజలి, పి. ధన్య, టీఎస్ సౌమ్య, సి.సోఫియాను అభినందించారు. ఈ ఆవిష్కరణకు యూకే పేటెంట్ దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే అత్యంత శక్తివంతమైన కాస్మిక్ కిరణాలను గుర్తించే పరికరాన్ని మేథమేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శైలాకుమారి, ఆర్.రాఘవేంద్ర ప్రదర్శించారు. ఈ ఆవిష్కరణనూ న్యాక్ పీర్ కమిటీ పరిశీలించి ప్రశంసించింది.

నేటితో ముగియనున్న పర్యటన

జేఎన్‌టీయూ (ఏ)లో రెండు రోజులుగా పర్యటిస్తున్న న్యాక్ పీర్ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రొఫెసర్లు, బోధనేతర ఉద్యోగులు, ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకమయ్యారు. వర్సిటీ పరిధిలో చదువుతున్న విద్యార్థులు, కోర్సు పూర్తయ్యాక ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందిన వారి శాతం, స్వయం ఉపాధి పొందుతున్న వారి వివరాలను ఆరా తీశారు. న్యాక్ పీర్ కమిటీ సభ్యుల పరిశీలన శనివారంతో ముగియనుంది.

గజ వాహనంపై శ్రీవారు



గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మో త్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు రాత్రి స్వామివారు గజ వాహనంపై పురవీధుల్లో సంచరిస్తూ భక్తులను మురిపించారు. పోతనామాత్యుడు రచించిన శ్రీమద్భాగవతంలోని గజేంద్రమోక్ష ఘట్టాన్ని తలపింపజేస్తూ ఊరేగింపు సాగింది. ఆపదలో ఉన్న భక్తులను ఆదుకునేందుకు తానెప్పుడూ సిద్ధమేనంటూ సర్వాలంకారభూషితుడైన స్వామి వారు భక్తులను పరవశులను చేశారు. అంతకు ముందు ఉదయం నుంచే ఆలయంలో ప్రధాన అర్చకులు పలుకూరి రవికుమార్, లిఖిల్‌వర్మ, ఉదయ్‌కుమార్, నవీన్‌కుమార్, చేతన్‌వర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రంగనాథుడి రథోత్సవం ఉంటుంది ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే రథోత్సవానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

25న ప్రైవేట్ టీచర్లకు 'ఎన్‌రిచ్‌మెంట్'

అనంతపురం ఎడ్యుకేషన్: నర్సరీ నుంచి విద్యార్థులకు బోధనా పద్ధతులపై ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు అవగాహన కల్పించేందుకు 'ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో ఈ నెల 25న 'ఎన్‌రిచ్‌మెంట్' పేరుతో సదస్సు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం అనంతపురంలోని అపుస్మా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు అనంతపురం లోని గుత్తిరోడ్డు శ్రీ-7 కన్వెన్షన్ హాలులో 'ఎన్‌రిచ్‌మెంట్' కార్యక్రమం ఉంటుందన్నారు. విశాఖపట్నానికి చెందిన రామునాయుడు, వాణిశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై బోధన పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు.

చీనీ చెట్ల దగ్ధం

నార్పల: గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పు రాజేయడంతో చీనీ తోట కాలి బూడిదైంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలకు చెందిన రైతు చిలమకూరి కాటమయ్య తనకున్నా 2.40 ఎకరాల్లో ఎనిమిదేళ్ల క్రితం చీనీ మొక్కలు నాటి సంరక్షిస్తూ వచ్చారు. మూడేళ్లుగా పంట చేతికి వస్తోంది. మరో పది రోజుల్లో చీనీ కాయలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు రైతు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో దుండగులు తోటలోకి చొరబడి చెట్లకు నిప్పు పెట్టారు. మంటలు ఎగిసి పడుతుండడం గమనించిన స్థానికులు అక్కడకు చేరుకుని అదుపు చేశారు. అప్పటికే దాదాపు 100 చెట్లు కాలి బూడిదయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోలాహలంగా సునామ జకినీమాత జాతర


సునామ జకినీమాతను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


పూర్ణ కుంభాలతో ఊరేగింపుగా వెళుతున్న దృశ్యం

- దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన ఆరె కటికలు

గుత్తి: ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీమాత ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం జాతర కోలాహలంగా జరిగింది. దేశంలోనే ఏకైక ఆలయంగా ఖ్యాతిగాంచిన గుత్తి ఆర్ఎస్‌లోని సునామ జకినీమాత జాతరకు దేశంలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆరె కటికలు తరలివచ్చారు. ఆలయంతో పాటు పరిసరాలు కిక్కిరిసాయి. సామూహిక కుంకుమార్చన, అభిషేకాలు, అయ్యప్ప స్వామి ఆలయంలో సునామ జకినీమాత ఉత్సవ విగ్రహానికి గంగ స్నానం, అక్కడి నుంచి జకినీమాత ఆలయం వరకూ పూర్ణ కుంభాలతో ఊరేగింపు నేత్రపర్వంగా సాగాయి. పూర్ణ కుంభాలతో వచ్చిన కన్యలు, ముత్తైదువులు జకినీమాతకు పాలాభిషేకాలు చేశారు.అనంతరం సహస్ర ముత్తయిదువుల పూజ నిర్వహించారు. 10, ఇంటర్ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన ఆరె కటిక విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేల మందికి అన్నదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమాలను ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, సునామ జకినీ మాత ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్‌రావు, సాయినాథ్, కోశాధికారి రామచంద్ర, గౌరవాధ్యక్షుడు మల్లేష్‌రావు, మహిళావిభాగం గౌరవాధ్యక్షురాలు సరస్వతీ బాయి, కార్యదర్శి లక్ష్మీబాయి పర్యవేక్షించారు.

ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వైవీఆర్

సునామ జకినీమాత ఉత్సవాల ముగింపు రోజు ఆలయాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్‌తో ఆపటు వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, పట్టణ కన్వీనర్ పీరాను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఆలయంలో అదనపు గదుల నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు.